వారం వ్యవధిలో రూ.8 లక్షల
సామగ్రి గాయబ్

- బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన విషయం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు


సామగ్రి దొంగలిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం


దొంగలు వదిలి వెళ్లిన ద్విచక్ర వాహనం

కుత్బుల్లాపూర్: రాత్రిపూట దొంగలు రెచ్చిపోతున్నారు. గడిచిన వారం రోజుల వ్యవధిలో దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ నిర్మాణ సంస్థ వద్ద ఉన్న బిల్డింగ్ మెటీరియల్ ఎత్తుకెళ్లారు. తాజాగా పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు రూ.8లక్షల విలువ చేసే సామగ్రిని ఎత్తుకెళ్లారని బాధితుడు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

◆ సుభాష్‌నగర్ ప్రాంతంలో ఫ్యాబ్రికేషన్ ఏర్పాటు చేసుకొని సత్యనారాయణ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వారం రోజుల వ్యవధిలో సుమారు రూ.8లక్షల విలువచేసే కాపర్ కేబుల్స్, వెల్డింగ్ మెషిన్, గ్రైనేటింగ్ మెషిన్, ఆక్సిజన్ ఎల్పీజీ సిలిండర్స్‌తో పాటు పలు వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపాడు. సోమవారం రాత్రి తాళం వేసి వెళ్లగా అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో యాక్టివా (టీఎస్ 13 ఈవై 6122)పై వచ్చి విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్న క్రమంలో స్థానికులు గుర్తించి వెంబడించడంతో ఆ వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారు.

◆ ఇదే క్రమంలో పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణంలో సైతం దొంగతనం జరిగినట్లు తేలింది. యాక్టివాపై వచ్చి దొంగతనం చేస్తున్నట్లు గుర్తించారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సైతం ఇటీవల ఓ నిర్మాణ సంస్థ గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు నిర్మిస్తుండగా బిల్డింగ్ మెటీరియల్ ఇనుప సామగ్రిని భారీ మొత్తంలో ఎత్తుకెళ్లారు. ఇలా స్క్రాప్ దొంగలు రెచ్చిపోవడంతో కొత్తగా నిర్మాణాలు చేసేవారు రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేసుకుంటున్నారు.

◆ దొంగలు వినియోగించిన వైట్ కలర్ యాక్టివా అమృత ఠాగూర్ పేరుపై ఉండగా ఒకటి ఎర్రమంజిల్, మరొకటి సుచిత్ర సమీపంలో త్రిపుల్ డ్రైవింగ్ చేస్తూ కెమెరా కంటికి చిక్కారు. రూ.4270 చలానా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ నరసింహ రాజు తెలిపారు.

25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం నేతలు

సుభాష్‌నగర్: తెలంగాణ ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు ఉద్యోగ నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసపోతూనే ఉన్నారని బీజేవైఎం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వారాల మహేష్ కుమార్ అన్నారు. అధిష్టానం పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే నియామకాలు చేపట్టాలని బీజేవైఎం ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహసీల్దార్ అశ్విన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

– ఈ సందర్భంగా వారాల మహేష్ మాట్లాడుతూ.. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలన్నారు. గ్రూప్–2, గ్రూప్–3 నోటిఫికేషన్స్‌లో అదనంగా పోస్టులు పెంచాలన్నారు. 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలన్నారు. ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్ట్‌పోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలని కోరారు. అన్ని నియమకాల్లో మహిళ అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

డివిజన్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా


మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీల ప్రతినిధులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతినగర్‌లోని రెండో డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ, శ్రీరంగాస్ నందనం, శ్రీ నిలయం, కాలనీల ప్రజలకు మేయర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ తమ కాలనీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. కాలనీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీసీరోడ్లు, డ్రైనేజీ,వీధి లైట్లు, పార్కుల అభివృద్ధి లాంటి పనులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామన్నారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు పలు సమస్యలపై మేయర్‌కు వినతి పత్రం అందజేశారు.

అమ్మవారి కరుణ కటాక్షాలు
ప్రజలందరిపై ఉండాలి

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- పలు దేవాలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


పూజాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్: శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కొలవడం ద్వారా అన్ని పనుల్లో విజయం వరిస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సుభాస్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలో విజయ దుర్గా సమేత బంగారం మైసమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పూజాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ, పందిరి యాదగిరి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, శ్రీనివాస్, సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో..

సుభాస్‌నగర్ డివిజన్‌లోని సూరారంకాలనీ సంతోష్‌నగర్‌లోని నిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతి పీఠంలో శ్రీ నిఖిలేశ్వరానంద స్వామిజీ (డా.నారయణ దత్త శ్రీమాల్)స్వామి వారి ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం స్వామి రచించిన శ్రీ హనుమత్ ప్రత్యంగిరా కృత్యాతంత్రం పుస్తకావిష్కరణను మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేకానంద పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సూరారం డివిజన్‌లో...

అమ్మవారి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉంటుందని, అమ్మవారి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండి అష్టైశ్వరాలతో జీవించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లోని జగదాంబ మాత సేవాలాల్ మహారాజ్ దేవాలయం బోనాల ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారయణ, నిజాంపేట్ ఎన్ఎంసీ కార్పొరేటర్ ఆగం రాజు, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ,పోలే శ్రీకాంత్, ప్రభుదాస్, ఫెరోజ్, ఆలయ కమిటీ సభ్యులు దశరథ్, జగన్, శంకర్ తదతరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు


దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మల్లారెడ్డి డెంటల్ కాలేజ్ ఫర్ ఉమెన్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. దంత పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు ఉచితంగా చికిత్సలు అందజేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయుడు పి.తిరుపతయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిరుపతిరెడ్డికి జన్మదిన శుభకాంక్షలు


ఎనుముల తిరుపతిరెడ్డికి జన్మదిన శుభకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

నిజాంపేట్: ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు కలిసి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కొలను గోపాల్‌రెడ్డి, ఎన్ఎంసీ ఫ్లోర్‌లీడర్ ఆగం పాండు, జగన్‌యాదవ్, నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలానికి రక్షణేది.?

- గతంలో మూడుసార్లు సర్వే నిర్వహించిన అధికారులు
- ప్రతి సర్వేలో 3353గజాల స్థలం ప్రభుత్వానిదేనని వెల్లడి
- 1100 గజాల స్థలం కాజేయడానికి చూస్తున్న కబ్జాదారులు


ఆర్టీఐ కింద సర్వే మ్యాప్ ఇచ్చిన అధికారులు


2024లో జిల్లా సర్వే అధికారులు ఇచ్చిన మ్యాప్

చింతల్: డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నం.155లో ఉన్న 3,553 గజాల ప్రభుత్వ స్థలంలో ఇప్పటి వరకు 2007, 2019, 2024లో ప్రభుత్వం తరఫున సర్వేలు నిర్వహించారు. 2007 జరిగిన సర్వేలో 3,550 గజాలు ఉన్నట్లు కొలతలతో కూడిన లేఅవుట్ ఇచ్చారు. 2019లో జీహెచ్ఎంసీ అధికారులు నిర్వహించిన సర్వేలో 3553 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. తిరిగి 2024లో ఇప్పటి డిప్యూటీ కమిషనర్ జిల్లా అధికారులతో సర్వే చేయించగా 3553 గజాల ప్రభుత్వ స్థలం ఉన్నట్టు తేలింది. భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ స్థల పరిరక్షణ సంఘం నేత అల్లాబకాష్ ఇటీవల ఆర్టీఏ చట్టం కింద వివరణ కోరగా అందులోనూ 3553 గజాలు స్థలం ప్రభుత్వానిదేనని తెలిపినట్లు పేర్కొన్నారు. అయినా 1100 గజాల స్థలానికి సంబంధిత అధికారులు ఫెన్సింగ్ వేయకుండా వదిలేశారు. దీనిపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ వేయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

◆ **నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులతో సర్వే..**

భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం నేత శ్రీనాథ్ రావు,మరికొంత మంది కలిసి నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ సంస్థతో గత నెల 26వ తేదీన సర్వే చేయించారు.అయితే సర్వేలో 2940గజాలు మాత్రమే ప్రభుత్వ స్థలమంటూ కొత్త మ్యాపును విడుదల చేశారు. గతంలో నిర్వహించిన మూడు సర్వేల్లో 3553గజాల స్థలం ఉన్నట్లు ప్రభుత్వ సర్వే అధికారులే స్పష్టం చేశారు. కానీ శ్రీనాథ్‌రావు ప్రైవేట్ సర్వే పేరుతో ప్రభుత్వ స్థలం తక్కువ ఉన్నట్లు అధికారులతో పాటు స్థానికులను తప్పుదోవ పట్టిస్తున్నారు. అతడి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే మ్యాపును సోషల్ మీడియాలో స్థానికంగా వైరల్ చేస్తున్నాడు.

◆ **గతంలో ఇతడిపై కేసు నమోదు..**

గతంలో ఈ ప్రభుత్వ స్థలాన్ని ఇతరులకు కిరాయికి ఇవ్వగా అప్పటి డీసీ ప్రశాంతి అతడిపై కేసు కూడా నమోదు చేసింది. అయినా శ్రీనాథ్‌రావు తన పంథా మార్చుకోకుండా తప్పుడు సర్వేలు నిర్వహిస్తూ ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడు. ఇతడి తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వానికి చెందిన 3553 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేసి కాపాడాలని భగత్‌సింగ్‌నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.


జూన్ 26న ప్రైవేట్ సంస్థ సర్వే చేసి ఇచ్చిన మ్యాప్

సమస్యల పరిష్కారమే ధ్యేయం


కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న సంక్షేమ సంఘాల నేతలు

కుత్బుల్లాపూర్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. వివిధ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు, పలువురు కార్యకర్తలు మంగళవారం ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు. అదే విధంగా దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి సర్వే నంబర్.156లో ఇప్పటికే నిర్మించిన ఇళ్లను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులను శ్రీశైలంగౌడ్ నిలదీశారు. బాధితులతో మాట్లాడి వారికి అండగా నిలిచారు.

దళిత ఎస్ఐకి రాష్ట్ర డీజీపీ అండగా ఉండాలి

ఉస్మానియా యూనివర్సిటీ: భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌కు రాష్ట్ర డీజీపీ, ప్రభుత్వం అండగా ఉండాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాలల పొలిటికల్ జేఏసీ చైర్మన్ డా.మంచాల లింగస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల వేధింపులతో ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్యహత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డీజీపీని కోరారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం డిమాండ్ చేశారు. నీట్ అక్రమాల పై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. జాతీయ స్థాయిలో కాకుండా రాష్ట్రాల వారీగా పాత పద్ధతిలో హెల్త్ యూనివర్సిటీల పర్యవేక్షణలో ప్రవేశ పరీక్షను నిర్వహించాలన్నారు. నీట్ ఫలితాలు విడుదలై 28 రోజులైన కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు ఎవరి పై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగ సమస్యలపై సీఎం స్పందించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగ సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చక ముందే పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించి జాబ్ కేలండర్ విడు దల చేయాలన్నారు. టెట్ అభ్యర్థులకు చదువుకునే సమయం లేనందున డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలన్నారు. ఈ సమావేశంలో సుమంత్, స్వాతి, రుక్మత్ పాషా, అంజి, ప్రశాంత్, సతీష్, కాంత్రి, కోటేశ్వర్, శ్రీవాణి, సౌజన్య, భవాని, రామ్ పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా రాంచందర్ రావుకు అవకాశం ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి గా మాజీ ఎమ్మెల్సీ, రాంచందర్ రావు అవకాశం ఇ వ్వాలని ఓయూ పూర్వ విద్యార్థులు కోరారు. వి ద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన రాష్ట్ర నాయకుడు, జంటనగరా ల అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చే శారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలను సమన్వయం చేసుకునే స్వభావం గల రాంచందర్ రావును బీజేపీ అగ్రనాయకులు గుర్తించి అధ్యక్షుడిగా నియమించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్, కామర్స్, జంతుశాస్త్రం, ఫుడ్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బీబీఏ, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్, జనటిక్స్, కెమిస్ట్రీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ సబ్జెక్టులను బోధించేందుకు ఈ నెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. సర్టిఫికెట్లను నేరుగా అకాడమిక్ డైరెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

అక్రమ నిర్మాణాలపై దుండిగల్ మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు మాదాసు కాలనీలో ఒక నిర్మాణంతో పాటు శంభీపూర్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కమర్షియల్ షెడ్లను కూల్చివేయించారు. కమిషనర్ సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి సంజన, సిబ్బంది పాల్గొన్నారు.

– దుండిగల్


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

షాపూర్‌నగర్ చౌరస్తాలోని బస్టాప్ వద్ద సంచీలో డంప్ చేసిన చెత్త



మాయమవుతున్న డంపర్ బిన్‌లు

రంగారెడ్డినగర్: ప్రధాన బస్టాప్‌లు, దుకాణాల ఎదుట ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లు మాయం అవుతున్నాయి.. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బస్టాప్‌లలో నిలబడే ప్రయాణికులు తినుభండారాలు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా డంపర్ బిన్‌లను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల సదరు బిన్‌లు మాయమై ఇనుప స్టాండ్‌లు మాత్రమే మిగిలాయి. దీనిపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలం కావడంతో డంపర్ బిన్ స్టాండ్‌ల వద్దనే స్థానికంగా ఉన్న దుకాణదారులు బస్తాల్లో చెత్తను తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. వాటిని రోజుల తరబడి తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇప్పటికై నా జీహెచ్ఎంసీ అధికారులు డంపర్ బిన్‌లను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


డ్రైనేజీ పనులు.. పగిలిన తాగునీటి పైపులైన్లు

సాయినగర్‌లో నిలిచిన తాగునీటి సరఫరా



నిజాంపేట్: అభివృద్ధి పనులు ప్రజలకు కొత్త కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి సాయినగర్‌లో నూతనంగా డ్రైనేజీ పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలు చోట్ల ఇళ్లకు సరఫరా అయ్యే తాగునీటి పైపులు పగిలిపోయాయి. దీంతో జలమండలి అధికారులు నీటి సరఫరాను నిలిపివేయడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై జలమండలి మేనేజర్ సౌమ్యను 'సాక్షి' వివరణ కోరగా పలు చోట్ల తాగు నీటి పైపులైన్‌లు తెగిపోయాయని తెలిపారు. వాటికి మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం యథాతథంగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.


సాయినగర్‌లో కొనసాగుతున్న డ్రైనేజీ పనులు



కొంపల్లి ఏఎంఆర్ గార్డెన్స్ ప్రధాన రోడ్డులో..

కుత్బుల్లాపూర్: కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో స్థానికులకు ప్రమాదం పొంచి ఉంది. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఏఎంఆర్ గార్డెన్స్ సమీపంలోని ప్రధాన రోడ్డులో కొన్ని రోజులుగా విద్యుత్ తీగలకు కిందకు వేలాడుతున్నాయి. ఎవరైనా అక్కడ నిలబడి చేతులు పైకెత్తితే అందేంత ఎత్తులో ఉన్నాయి. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈదులు గాలులతో వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ తీగలు మరింత కిందకు దిగితే పెను ప్రమాదం తలెత్తే అవకాశముందన్నారు. ప్రాణనష్టం వాటిల్లకముందే సంబంధిత అధికారులు స్పందించిన జారిపడిన వైర్లను సరి చేయాలని ఏఎంఆర్ గార్డెన్ వాసులు కోరుతున్నారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం

సుభాష్‌నగర్: రానున్న 2029లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడంతో పాటు మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపొందిన సందర్భంగా ఆ పార్టీ నేతలు మొక్కులు తీర్చుకుంటున్నారు. అందులో భాగంగా సుభాష్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కంది శ్రీరాములు తన సొంత ఖర్చులతో తిరుపతిలో మొక్కు చెల్లించుకోవడానికి 50 మంది కార్యకర్తలతో బయలుదేరారు. ఈ సందర్భంగా మంగళవారం మల్లారెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. రానున్న గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.


తిరుపతికి వెళ్లే బస్సు జెండా ఊపి ప్రారంభిస్తున్న మల్లారెడ్డి